

# పాములు

• గుడిమెట్ల గోపాలకృష్ణ

ఊళ్ళో 'పాములు' సంచలనం సృష్టించాయి.

ఎగ్జిబిషన్‌లో 'పాములు'...మధ్య మనిషి. ఎగ్జిబిషన్ మొత్తం చూడ్డానికి అర్థరూపాయి! పాముల ప్రదర్శనకి రూపాయి!!

ప్లాస్టిక్ తెరతో ఏర్పరచిన పాముల గదిలో ఇరవై ఏళ్ళ కుర్రాడు...కట్టలు కట్టలుగా పాముల్ని తీసి మూలలకి విసిరేస్తున్నాడు.

బుజాలమీద పాములు! ఒంటినిండా పాములు!!

బుస కొట్టిన పాముల పడగలమీద తప్పసి కొట్టి వాట్ని జడిపిస్తున్నాడు.

కలెక్షన్లు పందలు...వందలు...

ఎవరు అంటించేరోగాని అప్పుడే అంటుకుంది.

పాములబ్బాయి నాగులికి రాత్రి నాగుపాము కరిచిందని...ఇంజక్షను తీసుకున్నాడని...

చూసినవాళ్ళే మళ్ళీ ప్రదర్శన చూడ్డానికి తయారు!

అటవీ శాఖలో పన్జేస్తున్న ఫణీంద్రరావ్ చూస్తూ వూరుకోలేకపోయేడు.

"నీకు ఫలానా లైసెన్సులేదు...మూసెయ్యాలి" అన్నాడు.

మేనేజిమెంటుకి చెమట్లు పట్టేయి... పాముల ప్రదర్శన ఎగ్జిబిషను హైలైటు. అదే మూతబడితే ఎగ్జిబిషను కలెక్షన్లు దెబ్బతింటాయి.

నాగులుని ఫణీంద్రరావుకి లంచం కట్టేయమన్నారు.

కట్టనన్నాడు వాడు.

పాములన్నీ పేకేజీ పెట్టెల్లోకి తరలించబడ్డాయి. ఫణీంద్రరావు వాట్ని అటవీశాఖ ఆఫీసుకి మార్పించేడు.

"నా పాములు పోతే మళ్ళీ పట్టుకోగల్ను. లైసెన్సు కట్టగలను కానీ లంచాలివ్వను" అన్నాడు నాగులు.

** ** **

ఫణీంద్రరావుకి కొత్త సమస్య ఎదురయింది.

పేకేజీ పెట్టెల్లో పాములు బుసలు కొడుతున్నాయి. వాటికి మూడ్రోజులై మిల్కు ఫీడింగుగానీ మరే ఆహారమైనా లేదు. అటవీశాఖ ఆఫీసులో ఫీడింగివ్వాల్సిన వాళ్ళెవరూ లేరు.

పాములబ్బాయి నాగులుకి వూళ్ళో పెద్దలు చెప్పి చూశారు.

"ఈ ఊరు కాకపోతే మరో ఊరు. అక్కడ డబ్బులు చేసుకోగల్ను" అదీ వాడి జవాబు!!

లంచం ఛస్తే ఇవ్వను.

"నా కడుపుకింత సంపాదించుకోగల్ను." అదీ వాడి ధీమా!

ఆఫ్టరాల్ పాములు పెంచుకుంటున్న వాడికింత పట్టుదలుంటే చెట్లూ, పుట్టలూ... కొండలూ, కోనలూ...అన్నీ చూసుకుంటున్న నాకెంత పట్టుదల వుండాలి" ఫణీంద్రరావు తనలో తాను.

రోజులు గడుస్తున్న కొద్దీ పాములు చచ్చిపోతున్నాయి.

** ** **

పాములు చచ్చిపోతున్నాయన్న సంగతి ఫణీంద్రరావుకి తెల్సు, నాగులుకీ తెల్సు.

ఊళ్ళో పెద్దలకీ తెలుసు.

ఫణీంద్రరావుకి పాములు పగబట్టి వెంటాడుతున్నట్టు కలొచ్చింది.

అయినా పాముల్ని వదలదల్చుకోలేదు.

నాగులు దగ్గర్నించి తనకి రావల్సింది వస్తేగానీ పాముల్ని వదిలేది లేదు అని నిశ్చయించుకున్నాడు ఫణీంద్రరావు.

** ** **

రాత్రికి రాత్రి పాములు మాయమయ్యేయి. కొన్ని డొక్కుల్లో కొన్ని పాముల శవాలు!

ఫణీంద్రరావు గజగజ వణికిపోయేడు. ఎందుకంటే ఆఫీసు గదుల తాళాలు తాళాల్లానే వున్నాయి. ఎంక్వయిరీ అన్నాడు, అదన్నాడు, ఇదన్నాడు. లాభంలేకపోయింది.

నిజం పైకి పొక్కలేదు.

అది నాగులు కొక్కడికే తెల్సు.

నాగులు దగ్గర పది రూపాయిల 'బహుమతి' తీసుకొని నాలుగు ఎలకల్ని రూములోకి వదిలిన ప్యూను అప్పారావుకి కూడా తెలీదు. ఆ ఎలకలు పేకేజీలకు కన్నాలు పెట్టేయని...ఆ కన్నాల గుండా అవి పారిపోయాయని...

ఫణీంద్రరావుకి మాత్రం తర్వాత నిద్ర కరువైంది.

పాములు 'పగ' పడతాయని అతని ప్రగాఢమైన నమ్మకం అతన్ని నిద్ర పట్టనివ్వలేదంటే అది నిజం కాదు.

నాగులే 'పగ' పట్టేడని అతని వుద్దేశం!!